


RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త


తెలుగు దిన పత్రిక
అనుక్షణం ప్రజల పక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 288 గురువారం 14 నవంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## బుల్డోజర్ చర్యలపై సుప్రీం సీరియస్..



**నోటీసు ఇవ్వకుండా కూల్చివేతలు చేయవద్దని ఆదేశాలు**

- బుల్డోజర్ న్యాయంపై దేశవ్యాప్తంగా చర్చ
- నిర్మాణాల కూల్చివేతకు 15 రోజుల ముందు
- నోటీసులు ఇవ్వాల్సిందేనన్న సుప్రీంకోర్టు
- నోటీసులను రిజిస్టర్ పోస్టులో పంపడంతో
- పాటు నిర్మాణం వెలుపల అంటించాలని ఆదేశాలు
- నిర్మాణాలను ఎందుకు కూల్చివేస్తున్నదీ స్పష్టమైన
- కారణం తెలపాలన్న ధర్మాసనం
- రాజ్యాంగ పరిరక్షణకు పౌర హక్కుల పరిరక్షణ
- చాలా అవసరమని స్పష్టీకరణ
- రూల్ ఆఫ్ లాను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు

**న్యూఢిల్లీ,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):** బుల్డోజర్ చర్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ సుప్రీంకోర్టు బుధవారం కీలక ఆదేశాలు జారీచేసింది. కూల్చివేతకు 15 రోజుల ముందు భవన యజమానికి నోటీసులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ విషయంలో మార్గదర్శకాలు పాటించాల్సిందేనని పేర్కొంది. రిజిస్టర్ పోస్టులో నోటీసులు పంపడంతో పాటు నిర్మాణం వెలుపల నోటీసులు అంటించాలని తెలిపింది.ఆ నిర్మాణాన్ని ఎందుకు కూల్చేస్తున్నదీ స్పష్టమైన కారణం తెలపాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. కూల్చివేతను వీడియో తీయాలని ఆదేశించింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. రాజ్యాంగ పరిరక్షణకు పౌర హక్కుల పరిరక్షణ చాలా అవసరమని పేర్కొన్న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఏకపక్ష చర్యకు వ్యతిరేకంగా చట్ట నియమాలు తప్పనిసరని, చట్టపరమైన ప్రక్రియ అటువంటి చర్యను క్షమించదని స్పష్టం చేసింది. మిగతాది 2లో...


2లో.

## కాళోజీకి సీఎం రేవంత్ నివాళి


2లో.

## కాంగ్రెస్ ప్రభుత్వం లూటీ చేస్తోంది!

**మహారాష్ట్ర ప్రజలు ఆ పార్టీని నమ్మొద్దు**
**ముంబయిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

## తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన

- రేవంత్ భరత్ పట్టడం ఖాయం
- వారి అల్లుళ్ల ప్రయోజనాల కోసం ఫార్మా విలేజ్‌లు
- ఫార్మాలా వన్ గురించి కనీస నాలెడ్జ్ కూడా లేదు
- రేవంత్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్


హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ విధానాల వల్ల రాష్ట్రంలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి.. సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన జరిగిందన్నారు. కొడంగల్ నుంచే సీఎం రేవంత్ రెడ్డి భరతం పడుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు.. కిడ్నాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు
మిగతాది 2లో...



## లగచర్ల ఘటన... పట్నం నరేందర్ రెడ్డికి 14 రోజుల రిమాండ్

- నరేందర్ రెడ్డిని కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు
- ఈ నెల 27 వరకు రిమాండ్ విధించిన కొడంగల్ కోర్టు
- లగచర్ల ఘటనలో నరేందర్ రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణలతో అరెస్ట్





వికారాబాద్ నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి చేసిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మిగతాది 2లో...


2లో.

## 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

**అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి**

## వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పండి

**ముంబై ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి**
**భారీగా తరలివచ్చిన స్థానిక తెలంగాణ వాసులు**

ముంబై:నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): దివంగత శివసేన అధినేత బాల్ ఠాక్రేకు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు అజిత్ పవార్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మిలింద్ దేవ్‌రా వెన్నుపోటు పొడిచారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.ఈ ముగ్గురు మోసగాళ్లకు మహారాష్ట్ర ప్రజలు ముఖ్యంగా అక్కడి తెలుగు ప్రజలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ)కూటమిని గెలిపించాలని కోరారు. రేవంత్ బుధవారం సాయంత్రం ముంబైలో తెలుగు ప్రజలు నివసించే వర్లీ, ధారావి, సైన్ కోలివాడల్లో ఎంవీఏ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగ సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికార మహాయుతి కూటమిపై విమర్శలు గుప్పించారు. ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రేను వర్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, నిజామాబాద్ కోడలైన వర్షా గైక్వాడ్‌ను ధారావి నుంచి భారీ



మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడి తెలుగు ప్రజల సమస్యలన్నింటినీ ఎంవీఏ ప్రభుత్వం పరిష్కరించేలా తాను హామీగా ఉంటానని తెలిపారు. కాగా వర్లీ బీడీడీ చాల్స్‌లో నివసించే స్థానిక తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డి రోడ్డు షోకు బ్రహ్మరథం పట్టారు. దీంతో రేవంత్‌రెడ్డి కూడా తాను ముంబైలో కాకుండా నిజామాబాద్, కరీంనగర్‌లో ఉన్నట్టుగా అనిపిస్తోందని అన్నారు. రోడ్డు షోకు ముందు రేవంత్‌రెడ్డి వర్లీ బీడీడీ చాల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర (బాలాజీ) స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ ప్రజలు వారి సమస్యలు తెలుపుతూ వినతిపత్రాలు సమర్పించారు.

## హైదరాబాద్‌లో మరోసారి హైడ్రా కూల్చివేతలు

**రాంపల్లి సమీపంలోని**
**రాజ్‌సుఖ్ నగర్‌లో కూల్చివేతలు**
**రెండు బృందాలుగా విడిపోయి...**
**జేసీబీలతో కూల్చివేతలు**
**పదిహేనేళ్ల క్రితం రోడ్డును ఆక్రమించి**
**నిర్మాణాలు చేపట్టారన్న అధికారులు**

హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): హైడ్రా హైదరాబాద్ నగరంలో మరోసారి కూల్చివేతలు ప్రారంభించింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలో రోడ్డును కబ్జా చేసి కట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. రాంపల్లి సమీపంలోని రాజ్‌సుఖ్ నగర్ కాలనీలో ఈ కూల్చివేతలు చేపట్టింది. హైడ్రా అధికారులు జేసీబీతో నిర్మాణాలను కూల్చివేస్తున్నారు.పలువురు బిల్డర్లు పదిహేనేళ్ల క్రితం రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినట్లుగా హైడ్రా గుర్తించింది.



దీంతో రెండు బృందాలుగా విడిపోయి కూల్చివేతలు చేపడుతున్నారు. రాంపల్లి క్రాస్ రోడ్డుకు సమీపంలో రాజ్‌సుఖ్ నగర్ ఉంది. ఈ అక్రమ నిర్మాణాల కారణంగా స్థానికంగా ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ కూల్చివేతలకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు చెబుతున్నారు.

# బుల్డోజర్ చర్యలపై సుప్రీంకోర్టు సీరియస్..

## నోటీసు ఇవ్వకుండా కూల్చివేతలు చేయవద్దని ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిపి ఉంటాయని, వారి భవిష్యత్తు, భద్రత కూడా అందులోనే ఉంటుందని కోర్టు పేర్కొంది. నిందితుడు ఒక్కడే అయినప్పుడు ఆ ఇంట్లో నివసించే మిగతా వారికి ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారని ప్రశ్నించింది. కార్యనిర్వహణ అధికారే న్యాయమూర్తి పాత్ర పోషించి చట్టాన్ని పాటించకుండా ఇంటి కూల్చివేతకు ఆదేశాలిస్తే అది రూల్ ఆఫ్ లాను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. కూల్చివేతల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించినట్టు రుజువైతే పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల వేతనం నుంచి వసూలు చేస్తామని తెలిపింది. కూల్చివేతలకు సంబంధించి సంబంధిత వెబ్‌సైట్‌లో నోటీసులను ప్రదర్శించాలని ఆదేశాలు జారీచేసింది. అలాగే, నోటీసులను తప్పకుండా రిజిస్టర్డ్ పోస్టులోనే పంపాలని పేర్కొంది.

### అసలేంటీ బుల్డోజర్ న్యాయం?

ఇటీవలి కాలంలో దేశంలో బుల్డోజర్ న్యాయంపై విపరీతమైన చర్చ జరుగుతోంది. తొలుత ఇది ఉత్తరప్రదేశ్‌లో మొదలైంది. నేరగాళ్లలో భయం పెంచేలా నిందితుల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులను బుల్డోజర్‌తో కూల్చివేస్తున్నారు. ఈ న్యాయంపై రాజకీయంగా దుమారం రేగుతోంది. సుప్రీంకోర్టు కూడా దీనిని తప్పుబట్టింది. ఒక్క కట్టడాన్ని ధ్వంసం చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటమే అవుతుందని స్పష్టం చేసింది. అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌లు, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల విషయంలో ఇది వర్తించదని తేల్చి చెప్పింది. ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తాయని, వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు లేదని స్పష్టం చేసింది. యూపీలో మొదలైన ఈ బుల్డోజర్ న్యాయం ఆ తర్వాత పలు రాష్ట్రాలకు పాకింది. ఇటీవల తెలంగాణలో ఇది విపరీత చర్చకు దారితీసింది.ం

# లగచర్ల ఘటన... పట్నం నరేందర్ రెడ్డికి 14 రోజుల రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

లగచర్ల ఘటనలో నరేందర్ రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణలతో పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ క్రమంలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు... కొడంగల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించింది. పట్నం నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించనున్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు 16 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో ఈ రోజు మరో నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ రోజు అరెస్టైన వారిలో ప్రధాన నిందితుడు సురేశ్ సోదరుడితో పాటు మరో ముగ్గురు ఉన్నారు.

### నా అరెస్ట్ అక్రమం: పట్నం నరేందర్ రెడ్డి

కోర్టుకు తరలించే క్రమంలో పట్నం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన అరెస్ట్ అక్రమమన్నారు. రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక పాలనపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కొడంగల్‌లో రైతుల తిరుగుబాటుతో రేవంత్ రెడ్డి పరువు పోయిందని మండిపడ్డారు. లగచర్ల ఘటనను బీఆర్ఎస్ పార్టీకి ఆపాదించి కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

## అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి




హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు నగరంలో భారత రాష్ట్రపతి ముర్ము పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారుల తో సమావేశమయ్యారు. కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు మాన్యువల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆమె ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు అన్ని వేదికల వద్ద తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ÷ర్ టెండర్లను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. వైద్యారోగ్యశాఖ సహాయక సిబ్బందితోపాటు అర్హులైన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రపతి బస చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఓంజఆ శాఖను ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ ను ఆదేశించారు. డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీ అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశం, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కాళోజీకి సిఎం రేవంత్ నివాళి



హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):కాళోజి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పూలమాల వేసి నివాళు లర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాళోజీని స్మరించుకున్నారు. ఇదిలావుంటే అసెంబ్లీలో కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ తొలి పొద్దు కాళోజి నారాయణ రావు అన్నారు.తెలంగాణ వాడుక భాషలో రచనలు చేసి సాహిత్య రంగంలో విశేష కృషి చేశారన్నారు.తెలంగాణ భాషను,యాసను ఆదరించాలని చెప్పిన ఆయన కవితలు ఇప్పుడు మనకు ఆదర్శంగా మారాయన్నారు.పుట్టుక నీది,చావు నీది బ్రతుకంతా దేశానిదని చెప్పిన గొప్ప మహనీయుడు కాళోజి గారు అని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ తెలిపారు.

# తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన

(మొదటి పేజీ తరువాయి)

. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించటం కోసం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. తన ఏడు ఎకరాల భూమి పోతుందనే కలెక్టర్‌ను సురేష్ అడిగాడని.. సురేష్ అనే వ్యక్తి.. బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే అని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ .. వాడో పిచ్చోడు.. ఫార్ములా వన్ ఈ రేసు గురించి ఆయనకేం తెలుసు. నిఘా వ్యవస్థ వైఫల్యం వలనే లగచర్ల ఘటన.. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ. ప్రభుత్వ కుట్రకు పోలీస్ ఉన్నతాధికారుల బలికావద్దు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా. సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా. సురేష్ మమల్ని కలవటం తప్పు అయితే.. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పే. హైకోర్టులో పిటిషన్లు వేసి ప్రభుత్వం జడ్జిలను కూడా తప్పుదోవ పట్టిస్తుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిరా గాంధీ ఎమర్జన్సీ పాలన. రేవంత్ పిచ్చి నిర్ణయాల వలనే కొడంగల్ రగులుతోంది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్.. మహారాష్ట్రకు మూటలు మోస్తున్నాడు. రైతులు అక్రమ అరెస్టులు జరుగుతుంటే సీఎం ఎక్కడ. షోలాపూర్ చౌరాస్తాలో నిలబడినా.. రేవంత్‌ను ఎవరూ గుర్తుపట్టరు" అంటూ వ్యాఖ్యలు చేశారు. కనీసం సతీమణికి కూడా సమాచారం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తీవ్రవాదుల మాదిరి రైతులను పొలాల వెంబడి తరుముతున్నారన్నారు. ఫార్మా విలేజ్ వలన వచ్చే లాభమేంటో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర పెద్దలను తాను కలవటం తప్పు అయితే.. సీఎం గవర్నర్‌ను కలవటం కూడా తప్పే అని అన్నారు. కొడంగల్ రైతులు ఆరేడు నెలలుగా రగులుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోలేదని మండిపడ్డారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు అని చెప్పి.. మళ్ళీ యూటర్న్ ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఫార్మా సిటీ నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి చెప్పారు. అయితే సీఎం సొంత అల్లుడు సత్యనారాయణ రెడ్డి మాక్స్ బీఎన్ ఫార్మా కంపెనీ విస్తరణ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు వెళ్ళని రేవంత్.. మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మాత్రం వెళ్తారన్నారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తుంటే.. ఐజీ దాడి జరిగిందంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం లూటీ చేస్తోంది!

## మహారాష్ట్ర ప్రజలు ఆ పార్టీని నమ్మొద్దు - ముంబయిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేస్తోందని, అబద్ధాలతో ప్రజలను మోసపుచ్చుతోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు.తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వచ్చి అబద్ధాలను ఇక్కడి ప్రజలకు చెబుతున్నారని.. కాంగ్రెస్ పార్టీని ఏమాత్రం నమ్మవద్దన్నారు. బుధవారం ముంబయిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.99% హామీల అమలు ఇంకా మొదలే కాలేదు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, ఉద్యోగులు.. ఇలా అన్నివర్గాలకు వెన్నుపోటు పొడిచారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలను ఎలా మోసం చేశారో..అదే తరహాలో మహారాష్ట్ర ప్రజలను కూడా మభ్యపెట్టాలని చూస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారాయి. తెలంగాణలో అధికార దుర్వినియోగం జరుగుతోంది. తెలంగాణలో గెలిచిన తర్వాత దేశంలో ఏ ఎన్నికలు జరిగినా.. రాష్ట్ర సర్కారు ఏటీఎంగా ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో డబ్బులు తెచ్చి మిగిలిన చోట్ల ఖర్చుపెడుతున్నారు. తెలంగాణ ఎన్నికల్లో రాహుల్, సోనియా, ప్రియాంక, రేవంత్‌రెడ్డి ఊరూరా తిరిగి ఆరు గ్యారంటీల పేరుతో ఢంకా బజాయించారు. మేనిఫెస్టోలో మొదటి పేజీలోని పథకాలే అమలు చేయలేని రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు రావడం హాస్యాస్పదం. హామీలను అమలుచేసే శక్తి కాంగ్రెస్ నేతలకు లేదు.తెలంగాణ ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది.. దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పులున్నాయి. రాష్ట్రాన్ని పదేళ్లపాటు భారాస లూటీ చేయగా.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లూటీ చేస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ అభివృద్ధి చేసిందని భావిస్తే రాహుల్‌గాంధీకి సవాల్ చేస్తున్నా.. ముంబయి ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమా" అని కిషన్‌రెడ్డి అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు లో భుజంగరావు మధ్యంతర బెయిల్ రద్దు



హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ2 నిందితుడు మాజీ అడిషనల్ ఎస్పి భుజంగరావు బెయిల్‌ను రద్దు చేస్తూ బుధవారం నాంపల్లి కోర్టు ఆదేశాలిచ్చింది. మధ్యంతర బెయిల్‌ను రద్దు చేసిన కోర్టు గురువారం సాయంత్రం 4 గంటల లోపు జైలుకు వెళ్లాలని భుజంగరావుని ఆదేశించింది. అనారోగ్య కారణాల రీత్యా ఈ ఏడాది 19వ తేదీన భుజంగరావుకు మధ్యంతర బెయిల్ కోర్టు మంజూరు చేసింది. ఆ తర్వాత దానిని పొడిగిస్తూ వస్తోంది. అయితే గత నెలలో రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ వేయగా కోర్టు దానిని తిరస్కరించింది.అదే సమయంలో మధ్యంతర బెయిల్ విషయంలో మరికొంత ఊరట ఇచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావును మార్చి 23వ తేదీన పోలీసులు అరెస్టు చేశారు. అప్పట్నించీ మిగతా నిందితులతో పాటు ఆయన బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ కేసులో మొదట అరెస్టయ్యింది మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావు. ఆయన ఇచ్చిన సమాచారంతోనే అడిషనల్ ఎస్‌పిలు తిరుపతన్న, భుజంగరావులను అరెస్ట్ చేశారు. ఇక ఈ కేసులో సూత్రధారి ఎ1 ప్రభాకర్‌రావు అమెరికాలో ఉండగా ఆయన కోసం ఈ మధ్యే రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు.

# కోచింగ్ సెంటర్ల అతిప్రచారానికి అడ్డుకట్ట

**వందకువందశాతం ఫలితాల ప్రకటనలకు చెక్**

**ఎవరివో ఫోటోలు పెట్టి తమ ర్యాంకర్లు అంటే కుదరదు**

**ఇష్టం వచ్చినట్లు ప్రకటనలు ఇస్తే అంతే సంగతలు**

**తాజాగా మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం**




న్యూఢిల్లీ నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలు చేయకుంటా కేంద్రం ఆంక్షలు విధించింది. గతంలో ర్యాంకులు సాధించిన వారి ఫోటోలను కూడా పెట్టి ప్రకటనలు ఇవ్వరాదని హెచ్చరించింది. కోచింగ్ కేంద్రాలు చేసే 100 శాతం జాబ్ గ్యారెంటీ, 100 శాతం సెలెక్షన్ వంటి తప్పుడు ప్రకటనలను నియంత్రించేందుకు కేంద్రం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. కోచింగ్ సెంటర్ల అతి ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'మా కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకుంటే వందశాతం జాబ్ సెక్యూరిటీ ఇస్తాం.. నూటికి నూరు శాతం జాబ్ గ్యారంటీ' ఇలాంటి ప్రకటనలు ఇకపై కనిపించకూడదని కోచింగ్ సెంటర్లను కేంద్రం హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత, అవాస్తవ ప్రకటనలతో కోచింగ్ సెంటర్లు అభ్యర్థులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న కోచింగ్ సెంటర్లకు కేంద్రం బుధవారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ విషయంలో కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థకు అనేక ఫిర్యాదులు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. 'తమ సక్సెస్ రేటు, సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సులు మొదలైన విషయాల గురించి కోచింగ్ సెంటర్లు ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల నుంచి కొంత సమాచారాన్ని దాస్తుండడం గమనించినట్లు కేంద్రం వెల్లడించంది. ఇలా విద్యార్థులను తప్పుదోవ పట్టించే విషాయలను అంగీకరించబోమని అన్నారు. అందువల్ల వాటి నిర్వాహకుల కోసం పలు మార్గదర్శకాలు రూపొందించామని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే వెల్లడించారు. కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే ప్రకటనలనేవి వినియోగదారుల హక్కులను దెబ్బతీయకూడదని ఆమె అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి ఇప్పటికే జరిమానాలు విధించామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారికి వినియోగదారుల రక్షణ చట్టం కింద పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని అధికారులు పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లు అందించే కోర్సులు, వాటి వ్యవధికి సంబంధించి తప్పుడు ప్రకటనలు చేయకూడదన్నారు. అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైన తర్వాత వారి రాతపూర్వక అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్‌లు అభ్యర్థుల పేర్లు, ఫోటోలు ఉపయోగించకూడదని తెలిపింది. కోర్సుల గురించి ముఖ్యమైన సమాచారాన్ని బహిర్గతం చేయాలని పేర్కొంది. అయితే చాలా మంది యూపీఎస్సీ అభ్యర్థులు సొంతంగా చదువుకొని ప్రిలిమ్స్, మెయిన్స్ క్లియర్ చేసి, కేవలం ఇంటర్వ్యూలకు మాత్రమే కోచింగ్ తీసుకుంటారు. అటువంటి విషయాలను కోచింగ్ సెంటర్లు బహిరంగంగా తెలియ జేయాలని సూచించింది. ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులు తమ వద్ద ఏ కోర్సులో శిక్షణ తీసుకున్నారో తెలియజేయాలన్నారు. చట్టబద్ధంగా అనుమతి తీసుకున్న భవనాల్లో మాత్రమే కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి. అభ్యర్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, భద్రత కల్పించాల్సి ఉంటుంది.

# సూర్యాపేట టౌన్ పి ఎస్ పరిది లో షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన





**సూర్యాపేట నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):**
ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, సూర్యాపేట షీ టీం మహిళా యస్ ఐ నీలిమ , సూర్యాపేట పట్టణం లోని శ్రీరామ్ నగర్ కాలనీ లోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో సుమారు 400 మంది విద్యార్థిని, విద్యార్థులకు షీ టీమ్స్ , సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.

షీ టీం మహిళా యస్ ఐ నీలిమ మాట్లాడుతూ జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ అధ్వర్యంలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో, స్కూల్లో కళాశాలలో, వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులు, యువతి యువకులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏ టీ ఏం కార్డ్ వివరాలు, ఓ టీ పి వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు.. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు.
వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీ పీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు.గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డ్లు పెట్టుకోవాలని అన్నారు.

మహిళల రక్షణ పై పటిష్టంగా పనిచేస్తున్నామని, ఆకతాయిలా ఆటలు సాగవని, మహిళలను ఆడపిల్లలను గౌరవించాలని తెలియజేశారు అదేవిధంగా ఆత్మ రక్షణ కొరకు మెలుకువలు నేర్చు కోవాలన్నారుఎవరైనా మీ ఆత్మగౌరవాన్ని భంగపరిచినట్లయితే షీ టీం నెంబర్ 8712686056 కు సమాచార తెలియజేయవచ్చు అన్నారు.టీ సేఫ్ యాప్ గురించి విద్యార్థినిలకు వివరించారు.

ఈ కార్యక్రమం నందు షీ టీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, సాయి గౌతమి కళాశాల ప్రిన్సిపల్ యరగాని లక్ష్మయ్య, మహిళా సాధికారత కేంద్రంనుంచి రేవతి, వినోద్, తేజస్విని, మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుట్రలు చేసిన బిఆర్ఎస్‌ను వదిలేది లేదు

## ఎవరున్నా కఠినంగా శిక్షించి తీరుతాం

### వేర్వేరుగా ఘాటుగా హెచ్చరించిన భట్టి,కోమటిరెడ్డి, పొంగులేటి








హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేయగా, పట్నంకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామంలో జరిగిన ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసింది. బిఆర్ఎస్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రులు హెచ్చరించారు. ఇప్పటికే ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు ఘాటు హెచ్చరికలు చేశారు. తాజాగా డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, పొంగులేటిలు ఘాటుగా స్పందించారు. వేర్వేరుగా మాట్లాడుతూ బిఆర్ఎస్ కుట్రలను ఛేదిస్తామని అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేయించింది బీఆర్ఎస్సేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. దాడులతో రాష్ట్రాన్ని ఏం చేద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు. కలెక్టర్‌పై దాడిని బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదని, పదేండ్లుగా సీఎంగా పనిచేసిన కేసీఆర్ దీనిపై మాట్లాడరేంటని భట్టి నిలదీశారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదని చెప్పారు. దాడి చేస్తే ఊరుకుంటామని అనుకుంటే మూర్ఖత్వమే అని అన్నారు. ఎవ్వరున్నా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడం లేదని, అమాయకులైన ప్రజలను రెచ్చగొట్టి దాడి చేయించారని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. భూమి కోల్పోతున్న రైతుల బాధ తమకు తెలుసని, భూమి కోల్పోయే వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తున్నామని భట్టి చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితోనే రూరల్ ఏరియా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భూసేకరణ కీలకమని ఆయన తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమని భట్టి స్పష్టం చేశారు. కొడంగల్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నామని, రూరల్ ఏరియాకు అభివృద్ధిని విస్తరింపజేస్తామని ఆయన వివరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తాము ప్రజల పక్షాన పోరాడామని, తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ తరహాలో వ్యవహరించలేదని బీఆర్ఎస్ తీరుపై భట్టి మండిపడ్డారు. ఉద్యమంలో కూడా అమాయకులను రెచ్చగొట్టా రని, మీ కోసం అమాయక ప్రజలు బలి కావాలా అని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. దాడి ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై దాడి చేయడం అమానుషమని, అధికారం కోల్పోవడంతో ఫ్రస్టేషన్ లో బీఆర్ఎస్ నేతలు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారితో పాటు దాడికి ప్రోత్సహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను, పాల్గొన్న వారిని విడిచిపెట్టమని.. అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో
మాట్లాడుతూ.. కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడిన వారు కేటీఆర్‌తో ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయవచ్చని సూచించిన మంత్రి.. కలెక్టర్, అధికారులపై దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఇక ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నవాళ్లు జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే.. వారు ఎక్కడ దాక్కున్న రప్పించి జైలుకు పంపిస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ పత్తి కొనుగోళ్లపై నెలకొన్న సందిగ్ధంపై నోరు మెదపడం లేదని.. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ కనీసం పత్తికి మద్దతు ధర గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నోరు తెరిస్తే మూసీ ప్రక్షాళను అడ్డుకుంటామని మాట్లాడుతున్నారు తప్ప రైతుల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొందరు రైస్ మిల్లర్ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. రైతులను ఇబ్బందులు పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని.. రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరిక చేశారు. వారం రోజులల్లోగా మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే రైతులు వరి కోతలు ప్రారంభించారని.. రైస్ మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతీ పేదవారికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. 24 లక్షల ఇళ్లు పేదలకు ఇస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చామని.. ఇచ్చిన మాట ప్రకారం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం డబ్బులు ఇస్తామని ఆయన చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల ఎంపిక చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలోనే రోల్ మోడల్‌గా కొత్త ఆర్‌వోఆర్ చట్టం తీసుకు వస్తామన్నారు. రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతుల రుణమాఫీ చేయాల్సి ఉందని, డిసెంబర్ 9వ తేదీ లోపు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ధాన్యం కొనాలంటూ రోడ్డెక్కి ఆందోళనలు

## సీఎం రేవంత్ దిష్టిబొమ్మలతో నిరసనలు




హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలుచోట్ల రైతులు ఆందోళనకు దిగారు.మహబూబ్‌నగర్ జిల్లా గోపన్‌పల్లి శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను పెట్టి నిరసన తెలిపారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల, ఝాన్సీలింగాపూర్ గ్రామాల్లో రైతులు ధర్నా చేపట్టారు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కల్లూర్ రైతులు బీర్కూర్–పోతంగల్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్‌లోని కొనుగోలు కేంద్రంలో సన్నరకం వడ్లను కొనకపోవడం, మిల్లర్లు తరుగు తీస్తుండడంపై నిరసన వ్యక్తంచేశారు.కలెక్టర్ విక్టర్, అధికారులు వచ్చి సన్నధాన్యం కొనుగోలుతోపాటు కాంటాలు వేయడం ప్రారంభించడంతో రైతులు శాంతించారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలోని మిల్లుల వద్ద కొనుగోళ్లు నిలిపివేయడంతో అన్నదాతలు రోడ్డెక్కారు. లక్ష్మీగణపతి మిల్లుల్లో ధాన్యం లోడ్‌లను తీసుకోకపోవడంతో రైతులు అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పి మిల్లు యాజమాన్యంతో మాట్లాడడంతో రైతులు శాంతించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చెనగాని సైదులు ధాన్యం లోడు ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టి నిరసన తెలిపాడు. ట్రాఫిక్ జామవడంతో సంబంధిత అధికారులు ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించడంతో నెమ్మదించాడు.

# మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



నిర్మల్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంల బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. 15వేల రూపాయల లంచం తీసుకుంటూ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ షాకీర్ పట్టుపడ్డాడు. బిల్ కలెక్టర్ భరత్ సర్వీస్ బుక్ ఎంట్రీ కొరకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. కాగా, మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేస్తుండటంతో ఉద్యోగ వర్గాల్లో కలవరం మొదలైంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చేనేత కార్మికుడి ఆత్మహత్య



రాజన్న సిరిసిల్ల,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదరణ కరువై నేతలన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన చేనేత రంగం నేడు ఆర్డర్లు లేక వెలవెలబోతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరో నేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలోని ఎర్రం కొమ్రయ్య (55) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య కమల, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, సాయి కిరణ్, కూతురు వరలక్ష్మి ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బతుకమ్మ కుంటలో ఇక కూల్చివేతలు చేపట్టబోం: హైడ్రా చీఫ్

**బతుకమ్మ కుంట పునరుద్ధరణపై స్థానికులతో చర్చ**

**16 ఎకరాల కుంట 5 ఎకరాలకు కుచించుకుపోయిందని వ్యాఖ్య**



హైదరాబాద్,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త):
బతుకమ్మ కుంటలో ఇకపై కూల్చివేతలు చేపట్టబోమని హైడ్రా చీఫ్ రంగనాథ్ పేర్కొన్నారు. బుధవారం నాడు అంబర్ పేటలో పర్యటించిన ఆయన... బతుకమ్మ కుంటను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. హైడ్రాపై అపోహలు, ఆందోళనలు అక్కర్లేదని హామీ ఇచ్చారు. ఆక్రమించిన స్థలంలో ఉన్న నివాసాలను కూల్చబోమని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. స్థానికులతో బతుకమ్మ కుంట పునరుద్ధరణపై ఆయన చర్చించారు. 1962 నాటి రికార్డుల ప్రకారం బతుకమ్మ కుంట 16.13 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, కాలక్రమంలో ఆక్రమణలకు గురై ప్రస్తుతం 5.15 ఎకరాలు మిగిలిందని చెప్పారు.
ఈ విషయంలో స్థానికులు విజ్ఞప్తి చేయడంతో బతుకమ్మ కుంట ఆక్రమణల తొలగింపు, పునరుద్ధరణ చర్యలు చేపట్టామని హైడ్రా చీఫ్ పేర్కొన్నారు. అయితే, ఆక్రమించిన స్థలంలో ఉన్నప్పటికీ నివాస సముదాయాల జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరోవైపు హైడ్రాపై జరుగుతున్న అసత్య ప్రచారంపైనా రంగనాథ్ స్పందించారు. హైడ్రా ఎఫెక్టుతో నగరంలో రిజిస్ట్రేషన్లు పడిపోయాయని జరుగుతున్న ప్రచారం అంతా వట్టిదేనని కొట్టిపారేశారు.

# ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు



అమరావతినవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఖరారయ్యారు. ఈ నిర్ణయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. డిప్యూటీ స్పీకర్ పదవికి ఇవాళ నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో బుధవారం ఆయన నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ రాజు ఎంపిక లాంఛనప్రాయంగానే జరగనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఎన్డీయే కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. వైసీపీకి కేవలం 11 మంది ఎమ్మెల్యే ఉండటం.. పైగా వారు శాసన సభకు దూరంగా ఉండటంతో ఏకగ్రీవంగానే రఘురామ ఎన్నిక కానున్నారు. బీజేపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రఘురామ కృష్ణరాజు 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. నరసాపురం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. కానీ కొంతకాలానికే జగన్‌పై ఆయన విమర్శలు చేస్తూ రెబల్‌గా మారారు. ఈ క్రమంలో గత ఎన్నికల ముందు రఘురామ టీడీపీలో చేరారు. ఉండి నుంచి ఎమ్మెల్యేగా పోటీ గెలిచారు.

# బ్రిటన్-భారత్ భాగస్వామ్యం బలోపేతం

## సీఎం చంద్రబాబును కలిసిన బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్



అమరావతి,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): భారత్ లో బ్రిటన్ హైకమిషనర్ లిండీ కామెరాన్ నేడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. దీనిపై ఆమె సోషల్ మీడియాలో స్పందించారు. డైనమిక్ నేత, టెక్నాలజీపై బాగా పట్టున్న వ్యక్తి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధి, భారతదేశ పురోగతి పట్ల ఆయన విలువైన ఆలోచనల గురించి తెలుసుకోవడం ఈ భేటీ వెనుక ఉద్దేశమని వెల్లడించారు. యూనివర్సిటీల మధ్య ఒప్పందాలు, లోతైన సాంకేతిక పరిజ్ఞానం, గ్రీన్ ఎనర్జీ, ఆరోగ్య సేవల రంగం వంటి అంశాల్లో పరస్పర ప్రయోజనాల దిశగా బ్రిటన్–భారత్ మధ్య భాగస్వామ్యం బలోపేతం చేసుకునేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని లిండీ కామెరాన్ వివరించారు. ఆమె తన ట్వీట్ తో పాటు సీఎం చంద్రబాబును కలిసిన ఫోటోను కూడా పంచుకున్నారు.




# శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి వేడుకలు



తిరుమల, నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): కైశిక ద్వాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువఝామున 4.30 నుంచి 5.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారని వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీవారికి హుండీకి రూ. 3.81 కోట్లు ఆదాయం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 23 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని వివరించారు. నిన్న స్వామివారిని 61,446 మంది దర్శించుకోగా 21,374 తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.81 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

# అసభ్య పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెడితే తప్పేముంది?

## పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వలేం



అమరావతి,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై పోలీసులు కేసులు పెడుతున్నారంటూ పిల్ వేయడంపై హైకోర్ట్ అభ్యంతరం తెలిపింది. సోషల్ మీడియా ఆక్టివిస్ట్‌లపై పోలీసులు మూకుమ్మడిగా కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టు విజయబాబు వేసిన పిల్‌పై హైకోర్ట్‌లో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈ కేసులకు సంబంధించి పిల్ వేయడంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై పోలీసులు కేసులు పెడితే తప్పేముందని న్యాయస్థానం ప్రశ్నించింది. ఒక దశలో న్యాయమూర్తులను కూడా అవమానపర్చేలా పోస్టులు పెట్టారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టీకరించింది. పోలీసులు పెట్టిన కేసులపై అభ్యంతరం ఉంటే సంబంధిత వ్యక్తులు నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చని వెల్లడించింది. అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు చట్టనిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తుంటే తాము ఎలా నిలువరించగలమని వ్యాఖ్యలు చేసింది. పిల్‌కు సంబంధించి తగిన ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఇటీవల కాలంలో కొన్ని సోషల్ మీడియాల్లో కొంతమంది మహిళలను కూడా దూషిస్తూ పెట్టిన పోస్టులను హైకోర్టు ధర్మాసనం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనికి ముందే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం మాత్రం జడ్జిలపై కూడా పోస్టులు పెట్టారని, ఇలా అసభ్యకరంగా పోస్టులు పెడితే తామెలా నిలువరించగలమని నిలదీసింది. అదేవిధంగా అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిని పోలీసులు చట్టం ప్రకారం తప్పనిసరిగా వారిపై కేసులు నమోదు చేస్తారని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ హైకోర్టు బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వమని పునరుద్ఘాటించింది. ఈ విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టడం క్షమార్హం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. కాగా.. సోషల్ మీడియా ఆక్టివిస్ట్‌లపై పోలీసులు మూకుమ్మడిగా కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టు విజయబాబు హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. అయితే జగన్ జమానాలో విజయబాబు కీలక పదవులు నిర్వహించారు. అంతేకాదు గతంలో ఒక పత్రికకు ఎడిటర్‌గా కూడా విజయబాబు వ్యవహరించారు.

# మోసాలు బయటపడతాయనే బడ్జెట్ ఆలస్యం

కూటమి ప్రభుత్వ బడ్జెట్ పై తీవ్రస్థాయిలో స్పందించిన జగన్

ఈ నెల 11న బడ్జెట్ ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం

గవర్నర్ తో కూడా అబద్ధాలు చెప్పించారన్న జగన్

చంద్రబాబు డ్రామా ఆర్టిస్ట్ అంటూ విమర్శలు



అమరావతి,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): ఈ నెల 11న ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా, అదే రోజున కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ సమర్పించారు. ఇందులో మూలధన వ్యయం రూ.32,712 కోట్లు కాగా, ద్రవ్యలోటు రూ.68,743 కోట్లు అని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పై తాజాగా వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ బడ్జెట్ పత్రాలు చూస్తే చంద్రబాబు డ్రామా ఆర్టిస్ట్ అనే విషయం అర్థమవుతుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, ఇప్పుడు బడ్జెట్ ప్రవేశపెట్టారని, బడ్జెట్ ప్రవేశపెడితే మోసాలు బయటపడతాయని ఇన్ని నెలలు జాప్యం చేశారని వ్యాఖ్యానించారు గత ప్రభుత్వ హయాంలో... ఏపీ అప్పుల్లో శ్రీలంకను మించిపోతోందని తప్పుడు ప్రచారం చేశారని, ఇదే అంశాన్ని దత్తపుత్రుడితోనూ మాట్లాడించారని జగన్ వెల్లడించారు. ఎన్నికల ముంగిట రాష్ట్రం అప్పులు రూ.14 లక్షల కోట్లు అని ప్రచారం చేశారని, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అవే అబద్ధాలను గవర్నర్ తో కూడా చెప్పించారని మండిపడ్డారు. "మేం 2019లో అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రం అప్పులు రూ.3.13 లక్షల కోట్లు. 2024లో మేం అధికారం నుంచి దిగిపోయే నాటికి అప్పులు రూ.6.46 లక్షల కోట్లు. చంద్రబాబు హయాంలో అప్పులు 19 శాతం పెరిగితే... మా హయాంలో పెరిగిన అప్పుల శాతం 15 మాత్రమే. ఇప్పుడు చెప్పండి... అప్పు రత్న పురస్కారం ఎవరికి ఇవ్వాలి? ఆర్థిక క్రమశిక్షణ పాటించింది ఎవరు?" అంటూ జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ఇప్పుడు కూడా అబద్ధాలు చెబుతుండడం చూస్తుంటే సూపర్ సిక్స్ హామీలకు ఎగనామం పెట్టేట్టున్నాడని జగన్ దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు.... ఈ ఆరు నెలల్లోనే రూ.17 వేల కోట్ల మేర విద్యుత్ బిల్లులు బాదేశాడని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రానికి రిలయన్స్ వచ్చింది... మేం ఉన్నప్పుడే అంబానీ, అదానీ ఏపీకి వచ్చారు.... కానీ ఆ ప్రాజెక్టులన్నీ తామే తీసుకువచ్చినట్టు కూటమి నేతలు చెప్పుకుంటున్నారని జగన్ విమర్శించారు.

# రెండేళ్లలో ట్రైబల్ యూనివర్సిటీని పూర్తిచేస్తాం: లోకేశ్

విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థలపై

బుచ్చయ్య చౌదరి, బోండా ఉమ ప్రశ్నలు


వివరంగా సమాధానమిచ్చిన మంత్రి నారా లోకేశ్

2019లో నిర్ణయించిన స్థలంలోనే సెంట్రల్ వర్సిటీని పూర్తిచేస్తామని హామీ

తమకు పేరొస్తుందన్న ఉద్దేశంతోనే గత ప్రభుత్వం స్థలం మార్చిందని విమర్శ

అభివృద్ధి వికేంద్రీకరణ అంటే రూ. 500 కోట్లతో ప్యాలెస్

కట్టుకోవడం కాదని పరోక్షంగా జగన్‌పై విమర్శ




అమరావతి,నవంబర్ 13,(జర్నలిస్ట్ వార్త): వచ్చే రెండేళ్లలో ట్రైబల్ యూనివర్సిటీని పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించారు. రాజకీయంగా తమకు మంచి పేరు వస్తుందన్న దుగ్ధతో గత ప్రభుత్వ హయాంలో ట్రైబల్ వర్సిటీ స్థలం మార్చి అయిదేళ్లు పనులు ముందుకు సాగకుండా జాప్యం చేశారని విమర్శించారు. 2019లో నిర్ణయించిన స్థలంలోనే వచ్చే రెండేళ్లలో సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. విభజనచట్టం ప్రకారం పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థలపై శాసనసభ్యులు బుచ్చయ్యచౌదరి, బోండా ఉమ అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీలో లోకేశ్ సమాధానమిచ్చారు. 2014-19 మధ్య చంద్రబాబునాయుడు అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సెక్టార్ వైజ్ ఫోకస్ పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. అనంతపురం జిల్లాకు కియా తెచ్చారని, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, నెల్లూరులో విండ్ టర్బయిన్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, సెల్‌ఫోన్, ఉభయగోదావరిలో ఆక్వా, ఉత్తరాంధ్ర ఐటీ, మెడికల్ డివైజ్, ఫార్మా పరిశ్రమలను ప్రోత్సహించారని పేర్కొన్నారు.

విభజన చట్టంలో రాష్ట్రానికి కేటాయించిన విద్యాసంస్థలను కూడా వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటుచేశారని, ఐఐటీ తిరుపతికి, ఐఐఎం విశాఖకి, ఎన్ఐటీ తాడేపల్లిగూడేనికి, ట్రిపుల్ ఐటీ కర్నూలుకు, సెంట్రల్ వర్సిటీ అనంతపురానికి కేటాయించారని వివరించారు. అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఇదేనని, 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం కాదని పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు.ఐఐటీ తిరుపతికి ఆగస్టు 9, 2016లోనే భూములు కేటాయించి పనులు ప్రారంభించామని, ఎన్ఐటీ తాడేపల్లిగూడేనికి ఏప్రిల్ 16, 2016లో 172 ఎకరాలు, విశాఖలో ఐఐఎంకు ఏప్రిల్ 16, 2016లో 240 ఎకరాలు భూములు, సెంట్రల్ వర్సిటీ అనంతపురానికి ఏప్రిల్ 16, 2016లో 491 ఎకరాలు, ఐషర్‌కు 255 ఎకరాలు, ట్రిపుల్ ఐటీలకు కూడా అప్పట్లోనే భూములు కేటాయించినట్టు పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన భూములు కేటాయించడమేగాక, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, పనుల పురోగతిని ఆనాడు ప్రతినెలా ముఖ్యమంత్రి సమీక్షించారని చెప్పారు.

అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విభజన చట్టంలో ఉన్న విద్యా సంస్థలను కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, పనులను పూర్తిచేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేశారని కొనియాడారు. ఆయా విద్యాసంస్థలకు పెండింగ్ లో ఉన్న రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామని లోకేశ్ వివరించారు.

# 'కుబేరా' కోసం మహేష్‌బాబు...!


తమిళ స్టార్ హీరో ధనుష్ తెలుగులో చేస్తున్న మూవీ 'కుబేర'. విభిన్న చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ కుబేర సినిమాలో టాలీవుడ్ కింగ్ నాగార్జున కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా అంటూ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తెలుగు, తమిళంలో ఏక కాలంలో రూపొందుతున్న కుబేరా సినిమాలో హీరోయిన్‌గా రష్మిక మందన్న నటిస్తోంది. షూటింగ్ ముగింపు దశకు చేరడంతో ప్రమోషన్ కార్యక్రమాలు షురూ చేయాలని దర్శకుడు శేఖర్ కమ్ముల నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటీవల ఆసక్తికర పోస్టర్‌ను షేర్ చేయడం జరిగింది. నవంబర్ 15న కుబేర సినిమా ఫస్ట్ గ్లిమ్స్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ గ్లిమ్స్ ను సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా ద్వారా షేర్ చేయబోతున్నారు. మహేష్ బాబు విడుదల చేయడం ద్వారా కుబేర స్థాయి మరింత పెరగడంతో పాటు ఆ గ్లిమ్స్ కి మంచి స్పందన వస్తుందనే ఉద్దేశ్యంతో మేకర్స్ ఆ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. నిర్మాత సునీల్ నారంగ్‌తో పాటు పుస్కుర్ రామ్ మోహన్ విజ్ఞప్తి మేరకు మహేష్ బాబు ఈ గ్లిమ్స్ రిలీజ్ కి ఓకే చెప్పాడని తెలుస్తోంది. శేఖర్ కమ్ముల సినిమాలు కెరీర్ ఆరంభంలో క్లాస్ అండ్ సైలెంట్‌గా ఉండేవి. కానీ ఫిదా, లవ్ స్టోరీ సినిమాలతో తన పంథాను మార్చుకున్న శేఖర్ కమ్ముల 'కుబేర'తో మరోసారి మాస్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధం అవుతున్నాడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ మరియు అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌లలో రూపొందుతున్న ఈసినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్న కారణంగా మ్యూజికల్‌గా భారీ విజయాన్నిసొంతం చేసుకోవడం ఖాయం అనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు.నాగార్జున మొదటి సారి ఒక పూర్తి స్థాయి క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఈ సినిమాలో నటిస్తున్నాడు. ధనుష్, నాగార్జున మధ్య ఉండే సన్నివేశాలు చాలా వైవిధ్యభరితంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. గ్లిమ్స్ తో సినిమాపై ఉన్న అంచనాలు పెంచే అవకాశాలు ఉన్నాయి. పైగా మహేష్ బాబు గ్లిమ్స్ ను విడుదల చేయబోతున్నాడు కనుక అంచనాలు అదే రేంజ్‌లో ఉండటం ఖాయం. గ్లిమ్స్ 1 అంటూ చెప్పడం వల్ల త్వరలోనే మరో గ్లిమ్స్ వీడియోను సైతం విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.




# ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ ప్రాజెక్టులో కాంతర నటుడు



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. రానున్న ఈ ప్రాజెక్ట్ రీసెంట్‌గా లాంఛ్ అవ్వగా.. డిసెంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేయనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌లో మరో స్టార్ నటుడు నటించనున్నట్లు తెలుస్తుంది. కాంతారతో పాన్ ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకున్న రిషబ్ శెట్టి ఈ సినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రిషబ్‌తో పాటు ప్రశాంత్ నీల్ కజిన్. కన్నడ రోరింగ్ స్టార్ శ్రీ మురళిని కూడా ఈ మూవీకి అనుకుంటున్నట్లు సమాచారం. కాగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించబోతుండగా.. జనవరి 09 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తారక్ ప్రస్తుతం వార్ 2 సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. వార్ 2 షూటింగ్ అనంతరం ప్రశాంత్ నీల్ సెట్స్‌లో జాయిన్ అవ్వనున్నాడు. మరోవైపు ప్రశాంత్ నీల్ కూడా సలార్ 2 ప్రాజెక్ట్‌ను రీసెంట్‌గా మొదలుపెట్టాడు.




# బాహుబలి.2ని పుష్ప.2 బీట్ చేస్తుందా..?

ప్రస్తుతం పాన్ ఇండియా ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప 2. 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది ఈ చిత్రం. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా విడుదలకు ఇంకా నెల రోజులు కూడా లేదు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. మరోవైపు ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా టీం కూడా ఫుల్ బిజీగా గడుపుతుంది. ఇప్పటికే ఇండియా వైడ్ భారీ ఈవెంట్‌లను ప్లాన్ చేసిన చిత్రబృందం బిహార్ రాజధాని పాట్నాలో పుష్ప 2 ట్రైలర్‌ను నవంబర్ 17న లాంఛ్ చేయనుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా సృష్టించే రికార్డులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఏమో ఈ సినిమా అమీర్ ఖాన్ నటించిన దంగల్ రికార్డును బద్దలు గొడుతుందని కామెంట్లు చేస్తుండగా.. మరికొందరు ఈ మూవీ ప్రభాస్ ఆల్‌టైం రికార్డు ఉన్న బాహుబలి 2 సినిమా కలెక్షన్లను బద్దలు కొడుతుందని కామెంట్లు పెడుతున్నారు. ఒకవేళ ఇదే జరిగితే అల్లు అర్జున్ పుష్ప2 సినిమాతో సరికొత్త రికార్డును సృష్టించనున్నాడు. ఎందుకంటే ఇప్పటివరకు అత్యధిక కలెక్షన్లు సాధించిన ఇండియన్ సినిమాలు చూసుకుంటే మొదటి స్థానంలో అమీర్ ఖాన్ నటించిన దంగల్ (రూ.2100 కోట్లు) ఉండగా.. రెండో స్థానంలో బాహుబలి 2(రూ.1800 కోట్లు) ఉంది. వీటి తర్వాత ఆర్‌ఆర్‌ఆర్(రూ.1300 కోట్లు), కేజీఎఫ్(రూ.1200 కోట్లు) చిత్రాలు ఉన్నాయి. పుష్ప పార్ట్ 1 చిత్రం ఇండియా వైడ్‌గా రూ.400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ చిత్రంకు వచ్చిన పాపులారిటీ వలన ఇప్పుడు కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



# ఎల్లో చీర కట్టులో 'మట్కా' బ్యూటీ

ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 కిరీటాన్ని సొంతం చేసుకుని సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 2021లో తెలుగు సినిమా 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' తో టాలీవుడ్‌కి పరిచయం అయిన ఈ అమ్మడు తక్కువ సమయంలోనే స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్‌గా నటించే అవకాశాలు దక్కించుకుంది. ఈ ఏడాది ఆరంభంలో మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబో మూవీ 'గుంటూరు కారం' లో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా చేసినప్పటికీ మంచి గుర్తింపు దక్కిందని మీనాక్షి చౌదరి ఆనందం వ్యక్తం చేసింది. తాజాగా దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన 'లక్కీ భాస్కర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన మీనాక్షి చౌదరికి పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయం దక్కింది. ఈ అమ్మడు నటించిన మట్కా సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెగా హీరో వరుణ్ తేజ్, కరుణ కుమార్ కాంబోలో రూపొందిన మట్కా సినిమాలో మీనాక్షి చౌదరి లుక్ తో పాటు, పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని, కీలకంగా ఉంటుందని సమాచారం అందుతోంది. లక్కీ భాస్కర్‌తో సక్సెస్ జోరు మీదున్న మీనాక్షికి మట్కా సినిమా సైతం విజయాన్ని తెచ్చి పెట్టే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మట్కా సినిమా విడుదల అయిన వెంటనే మీనాక్షి చౌదరి 'మెకానిక్ రాకీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విశ్వక్ సేన్ హీరోగా నటించిన మెకానిక్ రాకీ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాలో హీరోయిన్‌గా నటించిన మీనాక్షి చౌదరి మరోసారి హిట్ కొట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మొత్తానికి సినిమాలతో బిజీ బిజీగా ఉన్న మీనాక్షి చౌదరి సోషల్ మీడియాలోనూ మంచి ఫోటోలను షేర్ చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఇండస్ట్రీకి వచ్చి కొంత కాలమే అయినా అప్పుడే రెండు మిలియన్‌ల ఫాలోవర్స్ కి చేరువైంది.

# 'పుష్ప 2' శ్రీవల్లి డబ్బింగ్ పని పూర్తి



అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో రూపొందిన పుష్ప 2 సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. మొదటి పార్ట్ సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో సీక్వెల్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా పుష్ప 2 ఉండబోతుందనే నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ ఉంది. రూ.1450 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిన ఈ సినిమా రూ.2000 కోట్ల వసూళ్ల టార్గెట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరో మూడు వారాల సమయం మాత్రమే ఉంది. షూటింగ్ దాదాపుగా పూర్తి అయింది. ఇటీవలే ఐటెం సాంగ్ పూర్తి అయింది. తాజాగా రష్మిక మందన్న తన శ్రీవల్లి పాత్ర కోసం డబ్బింగ్ చెప్పింది. సోషల్ మీడియా ద్వారా రష్మిక పుష్ప 2 కి డబ్బింగ్ చెబుతున్న ఫోటోలను షేర్ చేయడం జరిగింది. ఆ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పుష్ప 2 నుంచి ఈనెల 17న ట్రైలర్ రాబోతున్న విషయం తెల్సిందే. ఆ ట్రైలర్‌లోనూ రష్మిక డైలాగ్ ఉంటుందని తెలుస్తోంది. షూటింగ్ దాదాపుగా పూర్తి అయింది, మొదటి సగంకు డబ్బింగ్ చెప్పేశాను. అద్భుతంగా సినిమా ఉంది అంటూ రష్మిక అంచనాలు పెంచే విధంగా సోషల్ మీడియా పోస్ట్ షేర్ చేసింది. ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు సినిమాకు ఫిదా అవుతారు, నాకు మాటలు రావడం లేదు, మీరు పొందబోతున్న అనుభూతి గురించి చెప్పలేక పోతున్నాను అంటూ అంచనాలు పెంచే విధంగా పోస్ట్ చేసింది. రష్మిక మందన్న షేర్ చేసిన డబ్బింగ్ ఫోటోలు వైరల్ కావడంతో పాటు, ఆమె చేసిన వ్యాఖ్యలు సైతం సినిమాపై అంచనాలు పీక్స్‌కి తీసుకు వెళ్తున్నాయి. సినిమాలో శ్రీలీల ఐటెం సాంగ్ మరో రేంజ్‌లో ఉంటుందని అంటున్నారు. సుకుమార్, దేవిశ్రీ ప్రసాద్ కాంబోలో వచ్చిన ఐటెం సాంగ్స్ అన్నింటిలోకి కిస్సిక్ ఐటెం సాంగ్ చాలా స్పెషల్‌గా ఉంటుందని అంటున్నారు. దేవిశ్రీ ప్రసాద్ తో పాటు ఈ సినిమాకు తమన్ తో బ్యాక్‌గ్రౌండ్ కొన్ని సన్నివేశాలకు చేయించడం జరిగింది. డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం ఖాయం అనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఈవెంట్స్ చేయబోతున్నారు. ఏడు భారీ ఈవెంట్స్ చేయడం ద్వారా సినిమాను జనాల్లోకి తీసుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. రూ.100 కోట్లతో సినిమాను ప్రమోట్ చేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాకు ఇప్పటికే ఉన్న బజ్ ను డబుల్ చేయడం ద్వారా మొదటి రోజే రూ.500 కోట్ల వసూళ్లు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పుష్ప 2 కోసం ఎవరు ఏం మాట్లాడినా వైరల్ అవుతోంది. ఇప్పుడు శ్రీవల్లి డబ్బింగ్ చెబుతూ చేసిన వ్యాఖ్యలు ట్రెండ్ అవుతున్నాయి.